
సాక్షి ఒడిశా
ఆదివారం । 26 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,68,832లు, బంగారం 2గ్రాము 950 మిల్లీగ్రాములు, వెండి 19 గ్రాములు 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మార్గం సుగమం

పూరీ పట్టణంలో శ్రీజగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి మార్గం సుగమం అయింది.

- 8లో



ఎన్నాళ్లో వేచిన ఉదయం

రాయగడ జిల్లాలో లక్ష్మీ బస్సు సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి.

- 8లో

న్యూస్‌రీల్

100 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టు చేసినవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రెండు వాహనాలతో రవాణా చేస్తున్న 100 కిలోల గంజాయిని బరంపురం ఎక్సైజ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకొని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి ఉదయ్‌కుమార్ సంతోష్ తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ అధికారులు, సురడా పోలీసులు మార్గమధ్యలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానంతో ఒక కారులో సోదాలు చేయగా 60 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో కారుతో పాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అదేవిధంగా హింజిలికాటు బ్లాక్‌లో మరో వాహనంలో అక్రమంగా రవాణా చేస్తున్న 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఒకరిని అరెస్టు చేశారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.16 ఉంటుందని తెలియజేశారు.

విజిలెన్స్ వలలో తహసీల్దార్






సంజయ్‌ను కోర్టుకు తరలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. గంజాం జిల్లా జగన్నాథ్ ప్రసాద్ పోలీసుస్టేషన్ పరిధి కుదలా తహసీల్దార్ నాజీర్ సంజయ్‌కుమార్ దొళాయి రూ.6 వేల లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు శనివారం పట్టుబడ్డాడు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లాలోని జగన్నాథ్ ప్రసాద్ పోలీసుస్టేషన్ పరిధి కుదాల తహసీల్దార్ నాజీర్ సంజయ్ కుమార్ దొళాయి ఒక బిల్లు పరిష్కారం కోసం బాధితుడు పి.రాజ సేనాపతి వద్ద నుంచి రూ.6 వేల లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు బరంపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. దీంతో విజిలెన్స్ డీఎస్పీ సంతు కుమార్ మహాపాత్రో నాయకత్వంలో విజిలెన్స్ బృందం వలపన్ని తహసీల్దార్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అన్ని ఆధారాలతో అతడిని కోర్టుకు తరలించారు.

మేకపిల్లపై పెద్దపులి దాడి



మృతిచెందిన మేకపిల్ల

పర్లాకిమిడి: జిల్లాలోని గుమ్మా బ్లాక్ కుజాసింగి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన మేకల మందలో ఒక మేక పిల్లను పెద్దపులి చంపినట్లు అటవీశాఖ ఏసీఎఫ్ అశోక్ కుమార్ బెహరా శనివారం నిర్ధారించారు. దీనిపై జిల్లా అటవీ అధికారులు కుజాసింగి, నువాగాం, కొదమాసింగి, కుమ్ములుసింగి, గిరా ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేశారు. పెద్ద పులి మహారాష్ట్ర నుంచి సుమారు రెండు వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిందని తెలియజేశారు. ఈ మగపులి అటవీ ప్రాంతంలో ఎక్కడైనా ఆడ పులితో జతకట్టడానికి వెతుకుతున్నట్లు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు దప్పు చాటింపు వేయిస్తూ, చీకటి పడిన తర్వాత బయటకు రావొద్దని సూచిస్తున్నారు.



గజపతిలో తిరుగుతున్న పెద్దపులి (ఫైల్)

దారికాచిన మృత్యువు



ప్రమాదస్థలంలో గాయపడినవారు





బోల్తాపడిన వాహనం (ఇన్‌సెట్లో) సిమెంట్ బస్తాల కింద మృతదేహాలు

చిత్రకొండ స్వాభిమాన్ ఏరియాలో ఘోరం జరిగింది. అధిక లోడుతో వెళ్లిన ట్రక్ అదుపుతప్పి కుటుంబాలకు మోయలేని శోకం మిగిల్చింది. కబుర్లు చెప్పుకుంటూ ఉపాధి కోసం వెళ్తున్నవారు చెల్లాచెదురయ్యారు. ప్రశాంత వాతావరణం హాహాకారాలతో మారుమోగింది. సిమెంటు బస్తాలే యమపాశాలై ఒక్క క్షణంలో ఊపిరితీశాయి. దీంతో ఆరు కుటుంబాల్లో విషాదం అలముకుంది. వాళ్లనే నమ్ముకున్నవారికి కోలుకోలేని బాధ మిగిలింది. పని కోసం ప్రయాణం చేస్తున్నవారికి అదే చివరి ప్రయాణమైంది.

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.3 లక్షల పరిహారం: సీఎం నవీన్ పట్నాయక్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంబ్ పంచాయతీ హంతాల్‌గూడ ఘాట్ రోడ్డులో సిమెంట్, ఇనుప రాడ్లతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఆరుగురు మృత్యువాత పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఎంవీ 79 గ్రామానికి చెందిన పీకే స్వయి అనే కంట్రాక్టర్ చిత్రకొండ సమితిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం సిమెంట్, ఇనుప రాడ్లు, 13 మంది కూలీలతో ట్రక్కును పంపించాడు. అయితే ఈ వాహనం ఘాటీ ఎక్కుతూ అదుపు తప్పి బోల్తాపడడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మరో వ్యక్తి మృత్యువాతపడ్డాడు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా నవరంగ్‌పూర్ జిల్లా వాసులే కావడం విషాదకరం.

హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

విషయం తెలిసిన వెంటనే పేప్పరమేట్ల, జోడాంబ్ పోలీసుస్టేషన్ల సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకొని, గాయాలైనవారిని తక్షణమే చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అలాగే ప్రమాదం గురించి తెలియడంతో మరో కార్యక్రమం కోసం మల్కన్‌గిరి వచ్చిన నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి ప్రమాద స్థలానికి చేరుకొని మృతుల వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందినవారి కుటుంబాలకు రూ.3 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు.

మరో ఇద్దరి పరిస్థితి విషమం

గాయాలైన ఏడుగురిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో ఉన్నత చికిత్స కోసం వారిని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలైనవారిని చిత్రకొండ ఆరోగ్య కేంద్రంలో ఎంపీ రమేష్ మాఝి పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. ప్రతి ఒక్కరికీ ఉన్నతమైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విశాల్ సింగ్ క్షతగ్రాతులను పరామర్శించి మీడియాతో మాట్లాడారు. అధిక లోడ్‌తో వెళ్లడమే ప్రమాదానికి కారణమని వెల్లడించారు. లోడ్ వాహనంలో లేబర్‌ను తీసుకొని వెళ్లకూడదన్నారు. నిబంధనలు అతిక్రమించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ప్రమాదం జరిగిన వెంటనే జోడాంబ్ వద్ద ఉన్నటువంటి బీఎస్‌ఎఫ్ జవాన్లు, అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

మృతుల వివరాలు

ఆరుగురు మృతి చెందడంతో ఆ ప్రాంతమంతా రోదనలతో మిన్నంటింది. సోమేంద్ర బోత్ర(32), పూర్ణ బోత్ర (30), జిబ్రదన్ భోత్ర(22), పోలిసింగ్ భోత్ర(26), సురేంద్ర భోత్ర(28), ధనుజేయా భోత్ర(23)లు మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆదివారం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతోరామ్ భోత్ర, లక్ష్మణ్ మాఝి, కమల్‌దాస్ బోత్ర, సునీల్ గౌడ, అస్తు భోత్ర, లోకేంద్ర భోత్ర, అజిత్ సోనలు గాయపడినట్లు పేర్కొన్నారు. వారికి నాణ్యమైన వైద్యం అందజేస్తున్నారు.



రోడ్డుపక్కన మృతదేహాలు



మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్న దృశ్యం



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీ రమేష్ మాఝి

చిలికా క్షేమమా..?

- వేటగాళ్ల బారిన విదేశీ పక్షులు
- ఇద్దరు అరెస్టు, రెండు బోట్లు సీజ్
- మృత విదేశీ విహంగాలు స్వాధీనం



నల్లబన దీవిలో విదేశీ పక్షులు

బరంపురం: అసియా ఖండంలోనే అతి పెద్దదైన ఉప్పుటేరు చిలికా సరస్సుకి వస్తున్న విదేశీ పక్షులకు రక్షణ కరువైంది. మృత్యులోగిల్లో చిలికా పక్షులు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. అటవీ శాఖ అధికారులు నిషేధించిన చిలికా సరస్సులోని నల్లబన దీవిలో శనివారం బోట్లతో పక్షులను వేటాడుతూ ఇద్దరు వేటగాళ్లు అటవీ శాఖ అధికారులకు చిక్కారు. దీంతో వారి దగ్గర నుంచి వేటకి గురై మృతి చెందిన 6 విదేశీ పక్షులను మరియు రెండు బోట్లను స్వాధీన పరుచుకున్నట్లు చిలికా అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. అనంతరం వారిని కోర్టుకు తరలించారు.

18 నిఘా శిబిరాలు

విదేశీ అతిథి పక్షుల రక్షణ కోసం చిలికా సరస్సు చుట్టుపక్కలా 18 నిఘా శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎఫ్‌వో అముల్యా కుమార్ ప్రధాన్ తెలియజేశారు. ఒక శిబిరంలో ఒక అటవీ శాఖ అధికారితో పాటు స్థానికంగా 8 మంది వలంటీర్లు పనిచేస్తుంటారని పేర్కొన్నారు. విదేశీ పక్షుల మాంసం ఎక్కువగా హోటల్స్‌లో డిమాండ్ ఉండడంతో వేటగాళ్లు కేవలం చిలికాకి వచ్చిన విదేశీ పక్షులను వేటాడుతున్నారన్నారు. అనంతరం వాటిని బరంపురం, భువనేశ్వర్, బల్లుగాం, పూరి, ఖుర్ధా పట్టణాల్లో అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. నాలుగు రోజులుగా చలితీవ్రంగా పెరగడంతో చిలికా సరస్సు నల్లబన దీవికి లక్షకిపైగా విదేశీ పక్షులైన గ్రాండ్‌వాల్, కమీన్ పైప్, రెడ్‌వాల్ ట్లీడ్, ల్యాంగ్, టుట్ బ్రాస్టడ్, కింగ్ ఫిషర్, కామన్ కెస్ట్రల్, బ్రాహ్మిణి కైట్ కామన్, సెండ్ పిప్పర్, బ్లాక్ వింగెట్ స్టిల్స్ అనే జాతి పక్షులు వచ్చి చేరాయన్నారు. చలి పెరిగే కొలదీ విదేశీ పక్షుల రాక పెరుగుతుందన్నారు. ఈ ఏడాది సుమారు 10 లక్షలకు పైగా విదేశీ పక్షులు చేరుతాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. విదేశీ పక్షులు విడిది చేసుకున్న చిలికా సరస్సులో గల నల్లబన దీవితో పాటు సారనా, మంగరజొడి, బ్యాలగూన్, కలుపడా గాట్, రంబా మరియు కాళీజై దీవుల్లో పడవలను నిషేధిస్తూ, ఇతరులు లోపలికి రాకుండా ఆంక్షలు విధించినట్లు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



చిలికాలో వేటగాళ్ల దగ్గర స్వాధీనం చేసుకున్న మృత విదేశీ విహంగాలు



చిలికాలో పక్షుల వేటపై నిఘా ఏర్పాటు చేసిన దృశ్యం



పర్యాటకుల మధ్య సందడి చేస్తున్న పక్షులు



అరెస్టు చేసిన వేటగాళ్లను చూపిస్తున్న పోలీసులు

122 ఎకరాల్లో గంజాయి మొక్కలు ధ్వంసం



అర్జునాపల్లిలో గంజాయి పంటపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

- ఎక్సైజ్ డీఎస్పీ అభిరామ్ కుమార్

బరంపురం: గంజాం జిల్లా అస్కా బ్లాక్ అటవీ ప్రాంతంలో ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడిచేసి అక్రమంగా 122 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ డీఎస్పీ అభిరామ్ కుమార్ శనివారం తెలియజేశారు. రాష్ట్ర ఎక్సైజ్ విభాగం, కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఆదేశాల మేరకు శుక్ర, శనివారం రెండు రోజులు అస్కా పోలీసుస్టేషన్ పరిధిలోని అర్జునాపల్లి, పట్టుశాల, బల్లిగుడా, కొలబడా, అందరిగుడా గ్రామాల్లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను జేసీబీతో తొలగించి, నిప్పు పెట్టామని వెల్లడించారు. ధ్వంసం చేసిన మొక్కల విలువ సుమారు రూ.3.5 కోట్లు ఉంటుందని అస్కా తహసీల్దార్ కురేష్ చంద్ర జెనా తెలియజేశారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



కలబడా అటవీ ప్రాంతంలో గంజాయి ధ్వంసం చేస్తున్న దృశ్యం

కెనాల్ గేటు దొంగలించేందుకు యత్నం

- ముగ్గురు వ్యక్తులు అరెస్టు

జయపురం: స్థానిక అప్పరకొలాబ్ సాగునీటి కెనాల్ గేటు దొంగిలించేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శనివారం తెలియజేశారు. అరెస్టైనవారు జయపురం సమితి మఝిగుడకు చెందిన గుడు జాని(21), ఘాశీ హరిజన్(21), లక్ష్మణ ముదులి(20)లుగా వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బొడొనాయిక్‌గుడ సొలప గుంచిగుడ అప్పర కొలాబ్ సాగునీటి కెనాల్‌లో ఒక ఇనుప గేట్ ఉంది. పంటలకు సాగునీరు విడిచిపెట్టేందుకు ఈ గేటు వినియోగిస్తారు. అయితే ఈనెల 23వ తేదీ రాత్రి ముగ్గురు యువకులు వచ్చి ఆ గేటును దొంగిలించేందుకు గేటు కోస్తున్నారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు వెంటనే అక్కడికి చేరుకొని గేటు దొంగిలించబోతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. అనంతరం విషయాన్ని గగణాపూర్ పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ రాజకిశోర్ బారిక్ తన సిబ్బందితో సంఘటన ప్రాంతానికి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. వారిని తమదైన శైలిలో విచారించగా అమ్ముకునేందుకు తాము కెనాల్ గేటుని దొంగిలించేందుకు వచ్చామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు.



నిందితుడు గుడు జాని



ఘాశీ హరిజన్



లక్ష్మణ ముదులి

క్లుప్తంగా

జలపాతం వద్ద జారిపడిన యువకుడు



చికిత్స పొందుతున్న యువకుడు

అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాటిగూడ జలపాతం వద్ద శనివారం ప్రమాద వశాత్తు జారిపడి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఐదుగురు స్నేహితులు పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు శనివారం వచ్చారు. తాటిగూడ జలపాతాన్ని తిలకిస్తుండగా ప్రియరంజన్ విశ్వ (20) అనే యువకుడు జారిపడడంతో తలకు తీవ్రం గాయమైంది. వెంటనే స్నేహితులు అతనిని ఆటోలోని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కంటైనర్



ప్రమాదానికి గురైన కంటైనర్

మందస: మండలంలో జాతీయ రహదారిపై శనివారం ఓ కంటైనర్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాలను డ్రైవర్ చాకచక్యంగా తప్పించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఈ లారీ ప్రమాదవశాత్తూ బాలిగాం సమీపంలో జాతీయ రహదారిపై నుంచి పొలాల్లోకి వెళ్లిపోయింది. డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా లారీ నుంచి బయటకు రావడంతో ఘటనా స్థలంలో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

శబరిమల ప్రత్యేక రైలు ప్రారంభం



ప్రత్యేక రైలును ప్రారంభిస్తున్న ఎంపీ

ఆమదాలవలస : శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) నుంచి కొల్లాం రైల్వే స్టేషన్ వరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును శనివారం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ మొదలవలస రవి, రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ ఎల్.శివశంకర్, మెండ దాసునాయుడు, కొర్ను నాగార్జున ప్రతాప్, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, సూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, సనపల చెల్లం నాయుడు, గొండు రమణ, లంక నాగరాజు, బోనెల అప్పారావు, నాగళ్ల మురళీధర్, గుడ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పట్టపగలే దొంగతనం

గార: మండలంలోని లింగాలవలసకు చెందిన పిట్ట అప్పలరాజు ఇంట్లో దొంగలు చొరబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాలవలస సచివాలయం ఎదురుగా ఉన్న కాలనీలో ఉంటున్న అప్పలరాజు దంపతులు ఇద్దరు పిల్లలను పాఠశాలకు పంపించి ఉదయం 9 తర్వాత వ్యవసాయ పనులకు వెళ్లిపోయారు. పక్క ఇంటిలో ఉన్న అత్త కిల్లాన సూరమ్మ కూడా శ్రీకూర్మం వెళ్లింది. సాయంత్రం వచ్చి చూసేసరికి దుండగులు చొరబడి బీరువా తలుపులు విరిచి అందులో రూ. 25 వేలు, అర తులం చెవి బుట్టలు, పావు బంగారం బిళ్ల, శతమానం, ఎల్ఐసీ బాండు, పాసుపుస్తకాలు పట్టుకెళ్లిపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27, 28 తేదీల్లో యోగా, వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాలు పోటీల్లో పాల్గొనే యోగా, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం, రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో జరగనున్న పోటీల్లో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ఈ నెల 27న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం యోగా హాల్లో యోగా క్రీడాకారుల ఎంపిక, 28న శ్రీకాకుళం ఇండోర్ స్టేడియంలో పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో 55, 61, 67, 73, 81 కిలోల విభాగాలు, మహిళల కేటగిరీలో 45, 49, 55, 45 కిలోల విభాగాల్లో ఎంపికలు ఉంటాయని వివరించారు. ధ్రువీకరణతో డిగ్రీ, పీజీ విద్యార్థులు హాజరు కావచ్చన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

- ప్రారంభమైన లక్ష్మీ బస్సు సేవలు
- వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం నవీన్
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రాయగడ: జిల్లాలో లక్ష్మీ బస్సు సేవలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మన రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలియజేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాయగడ జిల్లాలో అత్యధిక శాతం ఆదివాసీ, హరిజన ప్రజలు నివసిస్తున్నారు. అందుకే మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు లక్ష్మీ బస్సు సేవలు ప్రారంభించినట్లు వెల్లడించారు. సుమారు రూ.90 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అందుకు సంబంధించి ఇప్పటికే నిధులను మంజూరు చేశామన్నారు.

రాష్ట్రంలో సుస్థిర పాలన

లక్ష్మీబస్సు సేవల ప్రారంభోత్సవానికి రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖల మంత్రి టుకుని సాహు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలకు సుస్థిరమైన పాలన అందించే సత్తా కేవలం బీజేడీకే ఉందన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మిషన్ శక్తి, స్వయం సహాయక బృందాలు, అమో ఒడిశా నవీన్ ఒడిశా, బీఎస్‌కేవై వంటి సంక్షేమ



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వివరించారు. మిషన్ శక్తి వంటి పథకాలు మహిళల జీవన సరళినే పూర్తిగా మార్చివేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత రెండింతల మెరుగవుతోందన్నారు. జిల్లాలో బస్సు సేవలు ప్రారంభమవ్వడంతో మరో మైలురాయిని అధిగమించినట్లేనన్నారు.

రూ.5లకే గమ్యానికి

జిల్లాలో ప్రారంభమైన లక్ష్మీ బస్సు సేవల వలన కేవలం రూ.5లకే తమ గమ్యానికి చేరుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మంత్రి టుకుని సాహు వివరించారు. పంచాయతీల నుంచి గ్రామాలకు, గ్రామాల నుంచి పంచాయతీలకు ఈ బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్కువ ధరకే నాణ్యమైన బస్సు సౌకర్యాలు కల్పిస్తోందని వెల్లడించారు. జిల్లాలో 52 బస్సు సేవలను అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేసిందన్నారు. ప్రస్తుతం 41 బస్సులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మిగతా బస్సుల సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

39 రూట్లలో రాకపోకలు

జిల్లాలో మొత్తం 182 పంచాయతీల్లోని 39 రూట్లలో బస్సు సేవలు కొనసాగుతాయి. అందుకు గాను 298 బస్సు స్టాపేజీలను రవాణా శాఖ గుర్తించింది. దీనిలో భాగంగా 204 బస్ స్టాపేజీల్లో కొత్తగా ప్రయాణికుల విశ్రాంతి గృహాలను నిర్మించేందుకు రూ.5,37,300 నిధులు కేటాయించగా, ప్రస్తుతం ఉన్న 94 స్టాపేజీల్లో విశ్రాంతి గృహాల ఆధునికీకరణ కోసం మరో రూ.1,53,345ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం వీటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

హాలువా బస్సు స్టాపేజీ ప్రారంభం

కార్యక్రమం ముగిసిన అనంతరం రాయగడకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాలువాలో కొత్తగా నిర్మించిన బస్ స్టాపేజీ, విశ్రాంతి గదిని రాష్ట్ర రవాణా, వాణిజ్య శాఖ మంత్రి టుకుని సాహు ప్రారంభించారు. అనంతరం లక్ష్మీబస్‌లో స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల నుంచి ప్రయాణించారు. ఆమె వెంట బస్సులో మంత్రి జగన్నాథ సరక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో, ఎస్డీసీ చైర్మన్ అనసూయా మాఝి, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, బిజు స్వాస్థ్య సమితి రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు సుధీర్ దాస్, రాయగడ కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ, మాజీ మంత్రి లాల్ బిహారి హిమిరిక తదితరులు ఉన్నారు.



సేవలకు సిద్ధమైన బస్సులు



లక్ష్మీబస్సులో టికెట్ కొనుగోలు చేస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషాపాడి



లక్ష్మీబస్సుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు టుకుని, సరక తదితరులు



హాలువా బస్సు స్టాపేజీ ప్రారంభిస్తున్న మంత్రి టుకుని



హాలువాలో కొత్తగా నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి గది

ఉద్యోగ అవకాశాలు లభించాయి



రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీబస్సు సేవలు ప్రారంభించడంతో మాకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉంది. జిల్లాలో సుమారు 52 మంది డ్రైవర్లు, 124 మంది కండక్టర్లు మరో 33 మంది సూపర్‌వైజర్ల నియామకం జరిగింది. విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేందుకు కృషి చేస్తాం.

– సుశాంత్ కుమార్, లక్ష్మీబస్సు డ్రైవర్

సంతోషకరం



రాష్ట్ర ప్రభుత్వం ఈ బస్సు సేవలు ప్రారంభించడం చాలా సంతోషకరం. కేవలం రూ.5లకే గమ్య స్థానానికి చేర్పిస్తుంది. ఇదివరకు ఏదైనా పనిమీద ఊరు నుంచి సమితి కార్యాలయానికి వెళ్లివస్తే సుమారు రూ.100కు పైగా రవాణా ఖర్చుల కోసం అయ్యేది. ఇక ఆ సమస్య లేదు. తక్కువ ధరకు గమ్యం చేరుకోవచ్చు. ప్రజా సంక్షేమమే పరమావధిగా భావించి సేవలందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– కమలా కద్రయ, రేవతిగుడ

మార్గం సుగమం



పూరీ విమానాశ్రయం నిర్మాణ ప్రతిపాదిత స్థలం

- పూరీలో నిర్మితమవ్వనున్న విమానాశ్రయం
- అటవీ, పర్యావరణ శాఖ ఆమోదం

భువనేశ్వర్: పూరీ పట్టణంలో శ్రీజగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి మార్గం సుగమం అయింది. లోగడ భారత పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. దీంతో పూరీ జిల్లా యంత్రాంగం భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఈ ప్రక్రియలో భాగంగా తొలి విడతలో ప్రభుత్వ భూసేకరణ, ప్రహరీ గోడల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మలి విడతలో ప్రైవేటు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. వీలైనంత త్వరగా ఈ సేకరణ పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా కృషి చేస్తుంది. విమానాశ్రయ నిర్మాణం ప్రతిపాదిత ప్రాంతంలో గాలి వేగం, దిశ సర్వే పనులు పూర్తయ్యాయి. విమానాల రవాణా కోసం రన్ వే ఓరియంటేషన్ (5/23 ఓరియంటేషన్) సైతం పూర్తయ్యింది.

అనుమతి మంజూరు

పూరీ పట్టణంలో 27.854 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతిపాదిత శ్రీజగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయి. ఈ మేరకు అవసరమైన అటవీ భూమిలో నిర్మాణ పనులకు పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఇటీవల భువనేశ్వర్‌లో ఉన్నత స్థాయి కార్యవర్గ సమావేశంలో విమానాశ్రయం నిర్మాణానికి నిరభ్యంతర ధ్రువీకరణ (ఎన్ఓసీ)పై చర్చ జరిగింది. సమావేశంలో 27.854 హెక్టార్ల అటవీ భూమికి విమానాశ్రయ నిర్మాణానికి ఎన్ఓసీ జారీ చేశారు.

1,164.836 ఎకరాల్లో నిర్మాణం

శ్రీజగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సమగ్రంగా 1,164.836 ఎకరాల భూమి అవసరం. పూరీ జిల్లా బ్రహ్మగిరి తహసీల్ గొరువాల్ పంచాయతీ సిపాసరుబాలి, షాండొపూర్ గ్రామాల్లో విస్తరించిన భూమిని సేకరిస్తున్నారు. ఈ స్థలంలో ప్రభుత్వ భూమి విస్తీర్ణం 943.456 ఎకరాలు, ప్రభుత్వేతర భూమి విస్తీర్ణం 221.48 ఎకరాలు ఉన్నాయి. మౌజాను పరిశీలిస్తే ప్రభుత్వ సిపాసరుబాలి గ్రామంలో ప్రభుత్వ స్థలం విస్తీర్ణం 942.996 ఎకరాలు, ప్రభుత్వేతర స్థలం విస్తీర్ణం 153.37 ఎకరాలు కాగా, షాండొపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలం 0.36 ఎకరాలు, ప్రభుత్వేతర స్థలం విస్తీర్ణం 68.11 ఎకరాలు విస్తరించి ఉన్నాయి. ఈ లెక్కన సిపాసరుబాలి గ్రామంలో సమగ్రంగా 1,096.366 ఎకరాలు, షాండొపూర్ గ్రామంలో 68.47 ఎకరాల స్థలం పూరీ శ్రీ జగన్నాథ్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి వినియోగించనున్నారు.

చెత్త వాహనాలు అడ్డగింత



చెత్త ట్రాక్టర్లను అడ్డుకుంటున్న కాలనీ ప్రజలు

పర్లాకిమిడి: పట్టణంలోని ఒకటో వార్డు ఓం శాంతి కాలనీ వాసులు మున్సిపాలిటీ పరిధి మూడో లైనులో చెత్త వేయవద్దని చెత్త ట్రాక్టర్లను శనివారం అడ్డుకున్నారు. చెత్తను సాయంత్రం సమయంలో తగులబెట్టడం వలన వాటి నుంచి వచ్చే పొగ, దుర్వాసనకు కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తను వేరే ప్రాంతానికి తరలించాలని, లేదంటే అనారోగ్యాల బారిన పడతామని ఆందోళన చేపట్టారు. దీంతో పురపాలక వైస్ చైర్మన్ లెంక మధు విచ్చేసి కాలనీ వాసులతో మాట్లాడారు. మున్సిపల్ హెల్త్ అధికారులను సంప్రదించగా పర్లాకిమిడి నుంచి రోజూ వస్తున్న చెత్తను వేరే చోటుకి డంపింగ్ చేయడానికి ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నట్టు హెల్త్ ఆఫీసర్ ఎరుకోల వెంకటరమణ తెలియజేశారు.



వాహనాలు రాకుండా కర్ర అడ్డుగా పెట్టిన దృశ్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డు జంక్షన్ నాలుగురోడ్ల కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సింగపల్లి గ్రామానికి చెందిన రట్టి చక్రపాణి ద్విచక్ర వాహనంపై టెక్కలి వైపు వస్తుండగా మెళియాపుట్టి జంక్షన్ నాలుగు రోడ్ల కూడలి వద్దకు వచ్చే సరికి ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో చక్రపాణికి తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ రిఫర్ చేశారు. టెక్కలి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల సొమ్ముతో మహిళ పరారీ!

టెక్కలి: స్థానిక రోటరీనగర్‌లో చిట్టీలు నిర్వహిస్తున్న ఓ మహిళ నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో సొమ్ము కట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా ఉన్న ఉద్యోగులు, మధ్య తరగతి వారి నుంచి చిట్టీల రూపంలో సుమారు రూ.2 కోట్లు వసూలు చేసిన సదరు మహిళ నాలుగు రోజులుగా ఆచూకీ లేకపోవడం, ఫోన్ సమాచారం సైతం లేకపోవడం గందరగోళంగా మారింది. అయితే ఇప్పటి వరకు ఎవరూ పోలీసులను ఆశ్రయించలేదు.

సద్దుమణిగిన 'లింగిడి' పాట వివాదం




జానపద కళాకారుడు మల్లేసుకు నగదు అందజేస్తున్న దృశ్యం

మందస: కోటబొమ్మాళి సినిమాలోని లింగిడి, లింగిడి పాట వివాదం ఎట్టకేలకు సద్దుమణిగింది. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక జోక్యంతో జానపద కళాకారుడు గువ్వాడ మల్లేసుకు న్యాయం జరిగింది. కవిటి మండలానికి చెందిన గువ్వాడ మల్లేసు అనే కళాకారుడు జానపద పాటలను పాడుకుంటూ జీవనం గడుపుతున్నాడు. లింగిడి, లింగిడి... లింగిడి కింద జంగిడి అనే పాట ఎక్కువగా పాడుతూ ఈ ప్రాంతీయులకు ఆనందపరిచేవాడు. అయితే ఈ సాహిత్యంతో పాటు బాణీని కూడా కోటబొమ్మాళి సినిమాలో వాడుకున్నారని ఆయన ఆరోపించారు. దీంతో కళావేదిక అధ్యక్షుడు రాపాక ధనరాజు, గౌరవసలహాదారుడు డాక్టర్ కుమార్‌నాయక్ తదితరులు సినీ నిర్మాతలను సంప్రదించి, సమస్యను వారి ముందు ఉంచారు. మందస మండలం హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో శనివారం ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. నిర్మాతలు బన్ని వాసు, కొప్పినేని విద్య కళాకారుడు మల్లేసుకు రూ.50వేలు ఇవ్వడానికి అంగీకరించా రు. ఈ నగదును సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక కోశాధికారి మామిడి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి బత్తిని రామారావు, ఉపాధ్యక్షుడు దున్న రామారావు, గౌరవాధ్యక్షుడు బొడ్డు గాంధీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొరకల లోకేశ్వరరావు సమక్షంలో మల్లేసుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రాచీన జానపదాలు, కళాఖండాలు, రూపాలు, కవితలు, జానపద కళలు నిక్షిప్తమై ఉన్నాయని, వీటిని పరిరక్షించడాని కి కళావేదిక శతవిధాలా కృషి చేస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



బరంపురం: పూజలు అందుకుంటున్న అయ్యప్ప స్వామి



బరంపురం: స్వామివారికి పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి:

పట్టణంలోని అయ్యప్ప స్వాములు మొక్క తోటమ్మ గుడివద్ద శనివారం పడిపూజ నిర్వహించారు. దీంతో వందలాదిమంది అయ్యప్పస్వాములు సంతోష్ స్వామి సన్నిదానంకు విచ్చేసి గురుస్వామి ఆశీర్వాదములు పొందారు. దీంతో అంతటా ఆధ్యాత్మిక శోభ అలముకుంది.

బరంపురం: నగరంలో అయ్యప్ప స్వామి దీక్షలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక పెద్ద బజార్, మంగళవారం పేట కల్యాణ మండప ప్రాంగణంలో భజనా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాములు



పర్లాకిమిడి: భజన కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు సిరిపురం విద్యార్థులు



అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులు

సంతకవిటి: గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల అండర్ 14, అండర్ 17, అండర్ 19 వయో విభాగాలలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం వి.వెంకటరావు శనివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆరికతోట విద్యార్థులు



క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రామభద్రపురం: ఇటీవల గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీ వి.అప్పలనాయుడు తెలిపారు. అండర్ 14 విభాగంలో టీ తేజేశ్వర్, కె.మధురిమ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బేస్‌బాల్ పోటీలలో అండర్ 14, 17 విభాగంలో పలువురు విద్యార్థులు ద్వితీయ స్థానంలో ప్రతిభ సాధించారని చెప్పారు. ప్రతిభ సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు డి.రామారావు, తదితరులు అభినందించారు.

గుమడాంలో డయేరియా



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుమడాం గ్రామస్తులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని ఎం.గుమడాం గ్రామంలో భవానీమాల దీక్షాదారులు ఆవాల రాంబాబు, పూడి సూర్యనారాయణ, బూర్లి గౌరినాయుడు, ఆవాల దుర్గప్రసాద్, కాపరపు రమేష్, పత్తిగుల్ల నాగరాజు, అల్లు అచ్చియ్యమ్మ, రాగోలు ఈశ్వరమ్మలకు డయేరియా సోకడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో ఒక్కసారిగా ఎనిమిది మందిలో డయేరియా లక్షణాలు కనిపించడంతో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సాయికృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామమంతా తిరిగి డయేరియా లక్షణాలు ఉన్నవారికి చికిత్స అందించారు.ముందుగా తాగునీటి ట్యాంకర్‌ను పరిశుభ్రం చేయించారు.

పోగొట్టుకున్న గోల్డ్ చైన్ బాధితునికి అప్పగింత



ట్రైనీ డీఎస్పీ మహేంద్ర చేతుల మీదుగా బాధితునికి గొలుసు, లాకెట్‌ను అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: పోగొట్టుకున్న బంగారు చైనును తిరిగి బాధితునికి వన్‌టౌన్ పోలీసులు శనివారం అప్పగించారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన చలపరెడ్డి సత్యనారాయణ (గోవిందస్వామి) ఈ నెల 23న పోలీస్ బ్యారెక్స్‌లో గల పోలీస్ గ్రౌండ్‌లో వాకింగ్‌కు వెళ్లి, బంగారు గొలుసు, లాకెట్‌ను పోగొట్టుకున్నారు. అనంతరం అదే గ్రౌండ్‌లో వాకింగ్ చేసేందుకు వెళ్లిన పోలీసు కమ్యూనికేషన్ విభాగంలో ఏఎస్‌ఐగా పని చేస్తున్న దత్తి సోమేశ్వరరావుకు సదరు బంగారు చైన్, లాకెట్ దొరకడంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు విచారణ చేసి, పట్టణానికి చెందిన సత్యనారాయణకు చెందినదిగా గుర్తించారు. ఈ మేరకు బాధితుని స్టేషన్‌కు పిలిపించి కమ్యూనికేషన్ ఏఎస్‌ఐ దత్తి సోమేశ్వరరావుతో కలిసి ట్రైనీ డీఎస్పీ మహేంద్ర సమక్షంలో అప్పగించారు. అనంతరం నిజాయితీగా వ్యవహరించిన ఏఎస్‌ఐను ఎస్పీ ఎం.దీపిక, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, వన్‌టౌన్ సీఐ వెంకటరావు, ఇతర పోలీసులు అభినందించగా, బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి



చెరువులో పడి మృతి చెందిన నూకలవాడ వీఆర్‌ఏ రాములు

తెర్లాం: చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి వీఆర్‌ఏ మృతి చెందిన సంఘటన తెర్లాం మండలం కొరటాం గ్రామంలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్‌ఐ ఆర్.రమేష్ శనివారం తెలిపిన వివరాలు... బలిజిపేట మండలం నూకలవాడ వీఆర్‌ఏగా పని చేస్తున్న యాగోటి రాములు కొరటాం గ్రామానికి సమీపంలో ఉన్న అప్పన్న చెరువులో పడి మృతి చెందాడు. కొరటాం గ్రామంలోని అత్త వారింటికి వచ్చిన రాములు శుక్రవారం ఉదయం స్నానానికి అప్పన్న చెరువుకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారడంతో చెరువులో పడిపోయాడు. స్నానానికి వెళ్లిన రాములు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో అతని భార్య పాపమ్మ గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు భర్త విషయం తెలియజేసింది. దీంతో వారంతా చెరువు వద్దకు వెళ్లి గాలించినా రాములు ఆచూకీ లభించలేదు. ఇదే విషయాన్ని తెర్లాం పోలీసుస్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో కొరటాం మాజీ సర్పంచ్ తెలియజేశారు. శనివారం ఉదయం స్థానిక పోలీసులు అగ్నిమాపక సిబ్బందితో మృతదేహం కోసం చెరువులో గాలించగా రాములు మృతదేహాన్ని కనుగొన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహానికి శవ పంచనామా చేసి పోస్టు మార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాములు మృతి చెందడంతో భార్య, కుమారుడు బోరున విలపిస్తున్నారు. తమకు దిక్కెవరంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

గాయపడిన హోంగార్డు..



పి.రమేష్(ఫైల్)

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎంటీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు పి.రమేష్‌కు బుధవారం రాత్రి సీతానగరం మండలం కింతలవానిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బొబ్బిలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం నిమిత్తం గురువారం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు రమేష్ శనివారం వేకువజామున మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి తరలించారు. ఈయన మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

రెండు లారీలు ఢీ - ఒకరి మృతి



ఆగి ఉన్న లారీని ఢీకొన్న లారీ

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మరుపల్లి గ్రామ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న లారీని విజయనగరం నుంచి రాయగడ వైపు వెళ్తున్న మరో లారీ శుక్రవారం రాత్రి బలంగా గుద్దేయడంతో ఆగిన లారీని మరమ్మతు చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ బబ్లీ యాదవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు గాయాల పాలైన డ్రైవర్‌ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండంగా మృతి చెందినట్టు ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి



లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

జామి: రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. అలమండ కంటకాపల్లి రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలపై సుమారు 65 నుంచి 70 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి ఒంటిపై తెలుపు, నీలం రంగుతో నిలువు గీతల షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 96665 55214, 94906 17089 ఫోన్ నంబర్లు సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి



మేడపై స్థానికులు గుర్తించిన మృతదేహం

రాజాం సిటీ: మద్యానికి బానిసై మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని స్థానిక పాలకొండ రోడ్డులో మోర్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనంపై శనివారం స్థానికులు గుర్తించారు. మృతుడు వారం రోజుల క్రితమే మరణించి ఉంటాడని స్థానికులు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా గుర్తించి విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు శ్యాంపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీను (40)గా గుర్తించారు. కార్పెంటర్‌గా విధులు నిర్వహిస్తూ ఈ క్రమంలో మద్యానికి బానిసై మృతి చెందాడని ఎస్‌ఐ నీలావతి తెలిపారు. మద్యానికి బానిసై నీరు అందక మృతి చెంది ఉంటాడని మృతుని భార్య మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి..

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒడిశా వాసి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రం బలింగ జిల్లా టిట్లాగర్‌కు చెందిన సుచిత్‌కుమార్ పాణిగ్రహి(54) వైద్య పరీక్షల నిమిత్తం కారులో విశాఖపట్నం వెళ్తున్నాడు. సరిగ్గా ఆరికతోట సమీపానికి వచ్చేసరికి కారు ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా మరో వస్తుందని గమనించిన కారు డ్రైవర్ వేగాన్ని అదుపు చేయలేక ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ పక్కన కూర్చున్న పాణిగ్రహి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చెరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఎస్‌ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 ఖోఖో పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్టు

- స్కూల్ గేమ్స్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న బాలుర జట్టు



రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న అండర్ - 19 జిల్లా బాలుర జట్టు

విజయనగరం: అండర్ - 19 అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో జిల్లా బాలుర జట్టు తమ సత్తా నిరూపించింది. ఈ నెల 23, 24 తేదీల్లో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన బాలుర క్రీడాకారులు ద్వితీయ స్థానం చేజిక్కించుకున్నారు. హోరా హోరీగా సాగిన పోటీల్లో అద్భుత ఆట తీరుతో రెండవ స్థానాన్ని దక్కించుకున్న క్రీడాకారులను అండర్ - 19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పివిఎల్ఎన్.కృష్ణ అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో రాణించిన క్రీడాకారులు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో జరిగే పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శనతో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, కోశాధికారి మల్లికార్జునరావు అభినందించారు.

సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు జిల్లా జట్ల పయనం



నరసారావుపేటలో జరగనున్న ఖోఖో పోటీలకు వెళ్తున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల ఖోఖో పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లు శనివారం పయనమయ్యాయి. ఈ నెల 26, 27, 28 తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్లకు నేషనల్ స్కూల్స్ అధినేత సత్తిబాబు క్రీడా దుస్తులు బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి చింత సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఉత్తమ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు అర్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ కోచ్ రమణమూర్తి, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.గోపాల్, కోశాధికారి మల్లికార్జునరావు, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీను, ఏఎస్‌ఎం కమలనాభరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో పీడీఎస్ సీజ్డ్ బియ్యం వేలం

- జేసీ మయూర్‌అశోక్



జేసీ మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో ఇటీవల వివిధ ప్రాంతాల్లో పట్టుబడి 6ఏ కేసుల రేషన్ పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 28, 29 తేదీల్లో ఆయా సంబంధిత మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్స్‌లో వేలం వేస్తామని జాయింట్ కలెక్టర్ కే.మయూర్‌అశోక్ శనివారం తెలిపారు. కొత్తవలస మండల కేంద్రంలో 67.02 క్వింటాళ్ల బియ్యం వేలం ఈ నెల 28న డీటీలు కె.ఇందిర, డీవీ రవిశంకర్, ఆర్.ఈశ్వమ్మ నిర్వహిస్తారని పేర్కొన్నారు. విజయనగరం మండల కేంద్రంలో 347.40 క్వింటాళ్ల బియ్యానికి సంబంధించిన వేలంను ఈ నెల 28న డీటీలు ఎ.రామారావు, కె.శ్రీనివాసరావు, బీవీ మురళీకృష్ణ, సి.చిరంజీవి చేపడతారని తెలిపారు. అదే విధంగా బొబ్బిలి మండల కేంద్రంలో 125.20 క్వింటాల బియ్యం వేలం ఈ నెల 29న ఆర్.ధనం, ఎ.స్వర్ణలత, సాయి కామేశ్వరరావు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలను సంబంధిత మండల కేంద్రాల్లో పబ్లిక్ ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.

నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ అండ్ టెక్ ఎక్స్‌పో



ప్రాపర్టీ అండ్ టెక్ ఎక్స్‌పో వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు సుభాష్‌చంద్రబోస్, తదితరులు

- నగరంలోని లీ పేరడైజ్‌లో మూడురోజుల పాటు ప్రదర్శన
- క్రెడాయ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్ చంద్రబోస్

విజయనగరం: విజయనగరం రింగ్‌రోడ్‌లోని లీ పేరడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు క్రెడాయ్ ప్రాపర్టీ టెక్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్స్‌పోను ఆదివారం ఉదయం ఏపీ శాసన సభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభిస్తారన్నారు. భవన నిర్మాణ ప్రక్రియలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి ప్రాపర్టీఎక్స్ పో పేరిట మూడు రోజులపాటు భారీ ప్రదర్శన ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏటా ప్రాపర్టీ ఎక్స్ పో పేరిట ప్రదర్శన నిర్వహిస్తున్నామని, కరోనా నేపథ్యంలో రెండేళ్లపాటు నిర్వహించలేదన్నారు. ప్రదర్శనలో సుమారు 250 వరకు స్టాల్స్ ఏర్పాటు చేశామని, 75 భవన నిర్మాణ సంస్థలకు చెందిన ప్రతినిధులు, బ్యాంకర్లు పాల్గొంటారని చెప్పారు. కొత్తగా ఇల్లు నిర్మించుకునే వారు ప్రదర్శనను తిలకిస్తే సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లా ప్రజలందరూ ప్రాపర్టీ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డులో (ఎల్విన్‌పేట చెక్‌పోస్టు సమీపంలో) ఎదురురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం, ఆటో ఢీ కొన్న ఘటనలో తోయక రాజేష్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కురుపాం మండలం గుంజరాడ గ్రామానికి చెందిన రాజేష్ అత్త ఇటీవల మరణించగా, శనివారం గ్రామంలో పెద్దకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి వాడగా మిగిలిన సామాన్లను కిరణా షాపుకు తిరిగి ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంతో గుమ్మలక్ష్మీపురం వస్తుండగా.. గుమ్మలక్ష్మీపురంలో పని ముగించుకొని ఏసుపాదం పి.లేవిడికు తన ఆటోలో వెళ్తుండగా ఎదురుదెరుగా వెళ్తూ ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన రాజేష్‌ను భద్రగిరి ఆస్పత్రికి తీసుకెళ్లగా, ప్రాథమిక వైద్య సేవలందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎల్విన్‌పేట ఎస్‌ఐ పి.షన్ముఖరావు తెలిపారు.

అకాల వర్షం.. అపార నష్టం





పెదకృష్ణరాజపురంలో వరి పొలంలో చేరిన నీరు, (ఇన్‌సెట్లో) తడిసిపోయిన వరి పంటను చూపిస్తున్న రైతు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో కోసిన వరి పంట పూర్తిగా తడిసిముద్దయింది. పల్లపు పొలాల్లో నీరు చేరడంతో అపార నష్టం వాటిల్లింది. కొండగంగుబూడి, పెదకృష్ణరాజపురం, శింగరాయి, కరకవలస తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో ఆరుగాలం శ్రమించి సాగుచేసిన వరి చేను నీటిపాలైందంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆదుకోవాలంటూ వ్యవసాయ అధికారులను వేడుకుంటున్నారు.

మానవ మృగాలకు.. పోక్సో కళ్లెం

చట్టం తన పని తాను చేసుకుపోతోంది. అభంశుభం తెలియని పసిపిల్లలు, బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడే మానవ మృగాలకు కళ్లెం వేస్తోంది. కేసుల దర్యాప్తులో పోలీస్ అధికారుల చొరవ, నేరాన్ని రుజువుచేయడంలో న్యాయవాదుల ప్రతిభ సత్ఫలితాలిస్తోంది. పోక్సో కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చే తీర్పుతో ముద్దాయిలకు జైలు శిక్ష పడుతోంది. బాధితులకు సత్వర నాయ్యం దక్కుతోంది. తప్పుచేసేవారు ఎంతటివారైనా శిక్ష తప్పదన్న గట్టి హెచ్చరిక సమాజానికి వినిపిస్తోంది. దీనికి ఇటీవల పోక్సో కోర్టు ఇచ్చిన తీర్పులే నిలువెత్తు సాక్ష్యం.

– సాక్షిప్రతినిధి, విజయనగరం

- అఘాయిత్యాలకు పాల్పడినవారిపై కఠిన శిక్షలు
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉక్కుపాదం
- సత్వర విచారణతో పోక్సో కోర్టు తీర్పులు
- రెండు నెలల్లోనే ఎనిమిది మంది ముద్దాయిలకు జైలుశిక్ష
- కేసు తీవ్రతను బట్టి రెండేళ్ల నుంచి 43 సంవత్సరాల వరకూ శిక్ష
- క్రియాశీలక న్యాయవ్యవస్థతో బాధితులకు సత్వర న్యాయం



ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో) కోర్టు కొరడా ఝుళిపిస్తోంది. 18 ఏళ్లలోపు బాలికలపై ఎవరు ఎలాంటి లైంగిక వేధింపులకు పాల్పడినా, అత్యాచారానికి ఒడిగట్టినా శిక్ష కూడా అంతే కఠినంగా ఉండేలా తీర్పులు వెలువడుతున్నాయి. విజయనగరంలోని పోక్సో కోర్టు స్పెషల్ జడ్జిగా రెండు నెలల కిందటే కె.నాగమణి బాధ్యతలు తీసుకున్నారు. అప్పటివరకూ ఇన్‌చార్జి జడ్జిగా ఉండడంతో 247 వరకూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధితులకు సత్వర న్యాయం అందించడం, దోషులు బాధితులను, సాక్షులను ప్రభావితం చేయకుండా నిరోధించడం అనే లక్ష్యాలతో కోర్టులో విచారణను వేగవంతం చేశారు. ఇదంతా సవ్యంగా జరిగేలా జిల్లా జడ్జి బి.సాయికల్యాణ చక్రవర్తి తగిన ఏర్పాట్లు చేశారు. మరోవైపు బాధితులు, బాధిత కుటుంబసభ్యుల నుంచి ఫిర్యాదు అందగానే వాస్తవాలను పరిశీలించి పోలీస్ శాఖ పరంగా కేసు దర్యాప్తు జరిగేలా విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక పాటిల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. సకాలంలో సాక్షులను కోర్టులో ప్రవేశపెడుతూ న్యాయ విచారణ ముందుకు సాగడానికి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు తనవంతు సహకారం అందిస్తున్నారు. ఇలా.. న్యాయ, పోలీస్ విభాగాల సమష్టి కృషి ఫలిస్తోంది. జడ్జి నాగమణి ఈ రెండు నెలల కాలంలో 20 కేసుల్లో తీర్పు ఇచ్చారు. బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన వివిధ కేసుల్లో ఎనిమిది మంది ముద్దాయిలకు కఠిన శిక్షలు విధిస్తూ తీర్పులు వెలువరించారు. తద్వారా ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో బాలికలపై బలాత్కారాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మరోవైపు బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ఆదేశాలూ ఇస్తున్నారు.

సత్వర విచారణతోనే న్యాయం...

బాలలపై అఘాయిత్యాల కేసుల్లో చార్జిషీట్ దాఖలైన తేదీ నుంచి రెండు నెలల్లోగా సత్వర విచారణతో పరిష్కరించాలని రాష్ట్ర హైకోర్టు విస్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పోస్కో కోర్టు ప్రత్యేక జడ్జిగా గత సెప్టెంబర్ 25న బాధ్యతలు చేపట్టిన కె.నాగమణి కోర్టులో విచారణను వేగవంతం చేశారు. ఉన్నత న్యాయస్థానం ఆదేశాల వెనుక ఉద్దేశాన్ని కార్యరూపం తీసుకురావడంలో సఫలమయ్యారు. ఎప్పుడైనా బాలలపై అఘాయిత్యం జరిగినపుడు ఆ బాధితులైనా, వారి తల్లిదండ్రులైనా ఎలాంటి భయాందోళనలు లేకుండా, ఒత్తిళ్లకు లొంగకుండా చట్టాన్ని ఆశ్రయిస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందని తన తీర్పుల ద్వారా స్పష్టమైన సంకేతాలిచ్చారు.

ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు...

కొంతమంది బాలికలు తమపై అఘాయిత్యం జరిగిన విషయాన్ని భయంతో వెంటనే చెప్పలేకపోవచ్చు. ఒకవేళ కుటుంబ సభ్యులకు తెలిసినా బెదిరింపులకో, ఒత్తిళ్లకో తలొగ్గి బయటపెట్టకపోవచ్చు. కానీ నేరస్తులకు కచ్చితంగా శిక్ష పడాలి. ఇది జరగాలంటే బాధితులు, బాధితుల తరఫువారు ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చు. బాలలపై అఘాయిత్యాలకు పాల్పడితే కచ్చితంగా కఠిన శిక్షలు తప్పవని విజయనగరం జిల్లా పోక్సో కోర్టు వెలువరించిన తీర్పులే ఒక హెచ్చరిక.

45 ఏళ్ల జైలుశిక్ష

గుర్ల మండలం పెనుబర్తికి చెందిన యాళ్ల గణపతి ఏడేళ్ల చిన్నారిపై తన పైశాచికత్వాన్ని చూపించాడు. ఆ పసిగుడ్డుపై కామవాంఛతో తాను మనిషిననే విషయాన్నే మరచిపోయాడు. ఈ ఏడాదే జరిగిన ఈ ఘటనపై పోలీసులు స్వల్ప కాలంలోనే దర్యాప్తు ముగించి అతన్ని పోక్సో కోర్టు ముందు నిలబెట్టారు. సమగ్ర విచారణ తర్వాత న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ముద్దాయికి 45 ఏళ్ల జైలుశిక్ష విధించారు. అంతేకాదు బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారంగా చెల్లించాలని ప్రభుత్వానికి ఆదేశించారు.

40 ఏళ్ల ఆరునెలలు జైలుశిక్ష:

భోగాపురం మండలం పోలిపల్లికి చెందిన పోలిపల్లి దుర్గారావు నాలుగేళ్ల పసిగుడ్డుపై పశువాంఛను ప్రదర్శించాడు. రాక్షసుడిలా ప్రవర్తించాడు. 2021 సంవత్సరంలో కేసు నమోదైంది. పోక్సో కోర్టు విచారణలో అతని నేరం రుజువైంది. 40 సంవత్సరాల ఆరునెలల పాటు జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. బాధితురాలైన బాలిక సంరక్షణ కోసం పరిహారంగా రూ.5 లక్షల పరిహారం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

గత 2 నెలల్లో పోక్సో కేసుల్లో తీర్పులు...

కేసు నంబరు	ముద్దాయి పేరు	బాధితురాలి వయసు (సంవత్సరాల్లో)	జైలుశిక్ష కాలం	బాధితురాలికి పరిహారం
ఎస్సీ 117/2021	పోలిపల్లి దుర్గారావు	4	40 సంవత్సరాల 6 నెలలు	రూ.5 లక్షలు
ఎస్సీ 35/2023	యాళ్ల గణపతి	7	45 సంవత్సరాలు	రూ.5 లక్షలు
ఎస్సీ 35/2021	కె.రాంకుమార్ వర్మ	16	34 సంవత్సరాలు	రూ.4 లక్షలు
ఎస్సీ 93/2021	జి.లక్ష్మణ	4	43 సంవత్సరాలు	రూ.4 లక్షలు
ఎస్సీ 34/2022	డి.ప్రసాద్	15	30 సంవత్సరాలు	రూ.4 లక్షలు
ఎస్సీ 119/2021	విక్రమ్ ఏసు	16	4 సంవత్సరాలు	రూ.25 వేలు
ఎస్సీ 19/2021	పి.అరవింద్	13	3 సంవత్సరాలు	రూ.20 వేలు
ఎస్సీ 121/2021	ఎ.సతీష్	17	2 సంవత్సరాల 3 నెలలు	రూ.20 వేలు

34 ఏళ్ల జైలుశిక్ష

చీపురుపల్లికి చెందిన రామ్‌కుమార్ వర్మపై 2021 సంవత్సరంలో కేసు నమోదైంది. అప్పటికి అతని వయసు 20 ఏళ్లు. 16 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోక్సో కోర్టు విచారణలో అతని నేరం రుజువైంది. 34 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.4 లక్షల పరిహారం ప్రభుత్వం నుంచి అదేలా ఆదేశాలు ఇచ్చారు.